సాక్షి బాపట్ల

శనివారం । 18 । మార్చి । 2023



రాయడం, చదవడం నేర్పించాలి

వినుకొండ(నూజెండ్ల):విద్యార్థులకు చక్కగా చదవడం, రాయడం, గణిత ప్రక్రియలు నేర్పడం అన్నింటికన్నా ముఖ్యమని డీఈవో శామ్యూల్ సూచించారు. లయోలా స్కూల్లో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి నిత్యాన్నదానానికి ఏలూరుకు చెందిన తిమ్మరాజు, వెంకట సుష్మ దంపతులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.

సీనియర్ డీసీఎంగా దినేష్‌కుమార్



లక్ష్మీపురం (గుంటూరు పశ్చిమ) గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎంగా ఎం.దినేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహిస్తున్న పి. భాస్కర్‌రెడ్డి సీనియర్ డీఓఎంగా మాతృవిభాగానికి బదిలీ అయ్యారు.

న్యూస్‌రీల్

యార్డులో 1,10,687 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,05,566 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,10,687 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 83,564 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

22లోపు ఎఫ్ఏ-4 మార్కులు నమోదు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 9 నుంచి 15 వరకు నిర్వహించిన ఎఫ్ఏ-4 పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసి, విద్యార్థుల మార్కులను ఈనెల 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఈవో పి.శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు విద్యార్థులు రాసిన జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను ఈనెల 18లోపు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. తదుపరి ఈనెల 22లోపు పాఠశాల విద్యాశాఖ వెబ్ పోర్టల్‌లో పాఠశాలల వారీగా మార్కులను విధిగా నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

నగరేశ్వరుడిని స్పృశించిన సూర్యకిరణాలు




అద్దంకి రూరల్: అద్దంకిలోని పురాతన శివాలయం వేయిస్తంభాలతో నిర్మించబడిన గంగావింధ్యావాసిని సమేత నగరేశ్వస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 7.15 గంటలకు స్వామివారిపై సూర్యకిరణాలు ప్రసరించాయి. ఈ దృశ్యాన్ని భక్తులు దర్శించుకుని స్వామివారికి పూజలు నిర్వహించారు.

సంరక్షకులపై చర్యలు చేపట్టండి

ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

సత్తెనపల్లి: మెనూ అమలు చేయడంలో లోపాలను గుర్తించి వెంటనే వసతి గృహాల సంరక్షణ అధికారిణులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ సి.హెచ్.విజయప్రతాప్ రెడ్డి ఈ నెల 9న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కోరారు. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా సహయ బీసీ సంక్షేమ శాఖ అధికారి బి.ఎస్.నాగేశ్వరరావు శుక్రవారం పట్టణంలోని బీసీ కళాశాల బాలికల వసతి గృహం-1 సంరక్షణ అధికారిణి కె.దీనసుధకు, ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహం సంరక్షణ అధికారిణి ఎం.ఇందిరాగాంధీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

కోవిడ్ జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలే దు. జిల్లాలో కరోనా మరణాలు ఎక్కడా సంభవించలేదు.

మైనర్ల ఆచూకీ గుర్తింపు

తెనాలిరూరల్: చోరీ కేసులో పోలీసులు సబ్ డివిజన్‌లోని ఓ స్టేషన్‌కు పిలిపించిన ముగ్గురు మైనర్ బాలురు పోలీసుల కళ్లుగప్పి స్టేషన్ నుంచి గురువారం సాయంత్రం పరారైన సంగతి తెలిసిందే. రాత్రికి బాలుర తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీసులను తమ పిల్ల ఆచూకీ గురించి ప్రశ్నించారు. బాలుర కోసం వెతుకులాట ప్రారంభించిన పోలీసులు తెనాలి బస్టాండ్, రైల్వేస్టేషన్, బాలుర స్వగ్రామంలో వెతికారు. చివరకు వారిని విజయవాడ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం తెల్లవారుజామున గుర్తించారు. అక్కడి నుంచి వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

మహిళాభివృద్ధికి చేయూత

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బొంత అర్జునరావు



స్వయం సహాయ మహిళల ఇళ్లకు వెళ్ల వైఎస్సార్ ఆసరా పథకంపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ బి.అర్జునరావు

బాపట్ల అర్బన్: వైఎస్సార్ ఆసరా పథకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బొంత అర్జునరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం డీపీఎం, ఏపీఎం, సీసీ, వీఓలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి సభ్యురాలికి రెండు విడతలుగా నగదు చెల్లించడం జరిగిందన్నారు. మూడవ విడత నగదు జమ చేసే కార్యక్రమం ఈనెల 25న జరుగుతోందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వీఓఏలు గడప గడపకూ తిరిగి వైఎస్సార్ ఆసరా పథకం గురించి అవగాహన కల్పించడంతోపాటు స్వయం సహాయక సంఘాలు వివరాలను గ్రామ సచివాలయం నోటీసు బోర్డులో ప్రదర్శించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. రెండు విడతలుగా ఎంత నగదు లబ్ధిదారులకు జమ అయింది, మూడవ విడతలో ఎంత నగదు వచ్చేది వివరాలు సిద్ధం చేయాలన్నారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు వీవోఏ, సీసీ, ఏపీఎంలు సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి వైఎస్సార్ ఆసరా పథకం గురించి తెలియ జేయడంతోపాటు ఆయా సంఘాలకు ఇప్పటి వరకు ఎంత నగదు వచ్చింది.. మూడవ విడతలో ఎంత నగదు వచ్చేది తెలియ జేయాలన్నారు. ఈనెల 25వ తేదీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా వైఎస్సార్ ఆసరా మూడవ విడత నగదు జమ చేయడం జరుగుతోందన్నారు. బాపట్ల జిల్లాలోని ఆరు నియోజక వర్గాల్లో వైఎస్సార్ ఆసరా మూడవ విడత క్రింద 27,630 గ్రూప్‌లకు రూ.238.31 కోట్లు నగదు విడుదల చేయటం జరుగుతోందన్నారు. ఈనెల 26 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు ప్రతి మండలంలో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగేలా చూసి శాసనసభ్యుల సమక్షంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ జరుగుతాయన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా లబ్ధిపొందుతున్న సంఘ మహిళలు ఆ నగదుతో మరింత ఆర్థికాభివృద్ధి చెందేలా యాంత్రీకరణతో కూడిన జీవనోపాధి పొందేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం వారికి ఉన్నతి, స్త్రీనిధి, బ్యాంక్ లింకేజ్ నుంచి రుణాలు ఇప్పించి సబ్సిడీతో కూడిన యంత్ర పరికరాలు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. అనంతరం బాపట్ల మండలంలోని ఇతేరు గ్రామ సచివాలయం సందర్శించారు. స్వయం సహాయక సంఘ సభ్యుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎ.లక్ష్మణాచారి, డి.సురేష్, ఏపీఎం, బాపట్ల సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాలపై సీరియల్ నంబర్లు

- బయటకు వచ్చే చాన్స్ లేదు
- టెన్త్ పరీక్షలు సమర్థంగా నిర్వహించండి
- జిల్లా విద్యాశాఖాధికారి రామారావు ఆదేశం

పర్చూరు: పది పరీక్ష ప్రశ్నపత్రాల్లో ఈ ఏడాది కొత్తగా సీరియల్ నెంబర్ ముద్రిస్తున్నారు.. పరీక్ష జరిగే సమయంలో ఎక్కడి నుంచైనా ప్రశ్నపత్రం బయటకు వస్తే ఆ సీరియల్ నెంబరు ఆధారంగా అది ఏ సెంటర్ నుంచి.. ఏ విద్యార్థి నుంచి బయటకు వచ్చింది అనేది త్వరగా కనిపెట్టవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు స్పష్టం చేశారు. శుక్రవారం భవనం వీరారెడ్డి రోటరీ భవనంలో పర్చూరు డివిజన్‌లోని 13 మండలాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పరీక్షలను అందరి సహకారంతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

వేర్వేరుగా బుక్‌లెట్..

ఈ ఏడాది జవాబు పత్రాలు 24 పేజీలు ఉంటాయని, సైన్స్ పరీక్ష రోజున ఒకే ప్రశ్నపత్రం ఉంటుందన్నారు. కానీ విద్యార్థులకు పీఎస్‌కు, ఎన్ఎస్‌కు వేర్వురుగా 12 పేజీల బుక్‌లెట్స్ ఇచ్చి జవాబులు వేర్వురుగా రాయమని చెప్పాలన్నారు. ముందుగా 12 పేజీల బుక్‌లెట్ ఒకటి ఇచ్చి దానిలో పీఎస్‌కు సంబంధించినవి మాత్రమే రాయమని చెప్పాలన్నారు. ఒక గంట తర్వాత మాత్రమే ఎన్ఎస్‌కు రెండో బుక్‌లెట్ ఇవ్వాలన్నారు.

చీఫ్‌లు, డీవోలకు నో సెల్‌ఫోన్

పరీక్షకు సంబంధం లేని ఏ వ్యక్తి కూడా సెంటర్‌లో ఉండరాదన్నారు. ఈ ఏడాది పరీక్ష కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించారన్నారు. చీఫ్‌లు, డీవోలు కూడా సెల్ ఉపయోగించరాదని, ఎవరిపైనైనా సెల్‌ఫోన్ ఉపయోగించినట్లు ఫిర్యాదులు అందినా వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పరీక్ష కేంద్రంలో గాలి, వెలుతురు, కరెంట్, టాయిలెట్స్ సక్రమంగా ఉండేటట్లు చూడాలన్నారు. విద్యార్థులందరికీ బెంచీలు సరిపోయే విధంగా సంబంధిత పాఠశాల హెచ్ఎం సహకారంతో చూడాలని, ఏ ఒక్క విద్యార్థి కూడా కింద కూర్చుని పరీక్షలు రాయకూడదన్నారు.

103 పరీక్ష కేంద్రాలు

జిల్లాలో 17,344 మంది విద్యార్థులు 103 కేంద్రాల్లో పరీక్షకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఇందుకు బాపట్ల డివిజన్ నుంచి 50 సెంటర్లు, పర్చూరు డివిజన్ నుంచి 53 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీవైఈవో కిరణ్‌కుమార్, బాపట్ల డీవైఈవో వెంకటేశ్వర్లు, ఎస్ఎస్‌సీ కంట్రోల్ రూం ఇన్‌చార్జ్ సాయి, యద్దనపూడి ఎంఈవో సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్కే సాధిఖ్, పర్చూరు ఎంఈవో నాగేశ్వరరావు, అన్ని మండలాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో ప్రిన్సిపల్ సెక్రటరీ తనిఖీలు



మంగళగిరి పోస్టాఫీస్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ప్రవీణ్ ప్రకాష్

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఇంటర్ పరీక్షలను జరుగుతున్న కేంద్రాలను శుక్రవారం ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పరిశీలించారు. అనంతరం జవాబు పత్రాలను భద్రపరిచే మంగళగిరి హెడ్ పోస్టాఫీస్‌ను సందర్శించి భద్రతా చర్యలు పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో సైతం పరీక్షా పత్రాలు ఏ విధంగా భద్రపరుస్తున్నారన్న విషయాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని సీకె జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు చాలా ప్రశాంతంగా జరుగుతున్నాయని, పరీక్షా కేంద్రాలకు విద్యార్థులకు ఆర్‌టీసీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందనీ, పరీక్ష పత్రాలు పోస్టాఫీస్‌కు తరలించే విషయం, భద్రతా చర్యలు చాలా బాగున్నాయన్నారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సెక్రటరీ ఎం.వి. శేషగిరిబాబు, ఆర్‌జేడీ వి.వి.సుబ్బారావు, డీవీఇవో జె. పద్మ, డీఈసీ మెంబర్ జి. బాలమోహనరావు, జి.సుధాకరరావు పాల్గొన్నారు.

అన్నదాతపై వరుణుడి దెబ్బ



పోతినవారిపాలెం వద్ద మిరప కల్లాల్లో పరదాలు కప్పుతున్న రైతు

చీరాల/కారంచేడు: చేతికొచ్చిన పంటలపై వరుణుడు దెబ్బకొట్టాడు. పంట నూర్పిడిలు అయి ధాన్యం ఆరబెట్టగా శుక్రవారం వేకువజాము నుంచి ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోంది. గురువారం అర్ధరాత్రి నుంచి వర్షం కురుస్తుండటంతో రైతన్నలు ధాన్యం సిరులను కాపాడుకునే యత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. చిట్టివాద, పేరాల, రూరల్ గ్రామాల్లో నూర్పిడులు జరిగిన ధాన్యం కుప్పలు నీటిలో తేలుతుండటంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పరదా పట్టలను కప్పుతున్నారు. కారంచేడు మండలంలో కూడా మోస్తరు వర్షాలు కురిశాయి. కల్లాల్లో ఆరబెట్టిన మిరప, వరి ధాన్యాలను రైతులు జాగ్రత్తగా కప్పుకున్నారు. వేటపాలెం మండలం తేలిక పాటి వర్షం జల్లులు పడ్డాయి. బల్లికురవ మండలం, మార్టూరు మండలంలో అర్ధరాత్రి మోస్తరు వర్షం కురిసింది. అదే విధంగా వర్షాలు కురిస్తే మిరప, శనగ, వరికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

ముగిసిన రబీ

సేద్యానికి రబీ ప్రధానంగా చెబుతారు. ఎందుకంటే రైతుకి చక్కగా ప్రకృతి అనుకూలించే కాలం. ఏవో కొద్దిపాటి వాణిజ్య, సాధారణ పంటల వైపు మొగ్గే కాలం కూడా ఇదే. పంట నష్టమన్నది దాదాపుగా ఉండని కాలంగా రైతన్నలు పిలుచుకుంటారు. అలాంటి రబీ సీజన్‌ను కర్షకులు గుంటూరు జిల్లాలో చక్కగా సద్వినియోగించుకున్నారు. ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా 1,52,772 ఎకరాల్లో నాగలిపట్టి.. అరకదున్ని.. మొక్కజొన్న, జొన్న, పెసర పంటలు వేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.



మొక్కజొన్న పంట(ఫైల్)

- 1,52,772 ఎకరాల్లో సాగు
- అత్యధికంగా 62,441 ఎకరాల్లో మొక్కజొన్న సాగు
- ముగిసిన ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు
- ఆర్‌బీకేల్లో జాబితా ప్రదర్శన, గ్రామ సభల నిర్వహణ

కొరిటెపాడు (గుంటూరు): జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి చివరి నాటికి రబీ సీజన్ ముగిసింది. జిల్లాలో ఉద్యాన, వ్యవసాయ పంటలు కలిపి 1,52,772 ఎకరాల్లో సాగయ్యాయి. ఇందులో వ్యవసాయానికి సంబంధించి సాధారణ సాగు విస్తీర్ణం 1,73,115 ఎకరాలు ఉండగా, రబీ సీజన్ ముగిసే సమయానికి 1,43,086 ఎకరాల్లో పలు పంటలు సాగై 83 శాతంగా నమోదైంది. ఉద్యాన పంటలకు సంబంధించి సాధారణ సాగు 11,123 ఎకరాలకు గాను రబీ సీజన్ ముగిసే నాటికి 9,686 ఎకరాలలో పలు ఉద్యాన పంటలు సాగయ్యాయి. దీంతో పాటు 1,52,736 ఎకరాల్లో ఈ-క్రాప్ పూర్తి అయ్యి 99.98 శాతం నమోదైంది. అలాగే ఈ-కేవైసీకి సంబంధించి 1,44,315 ఎకరాల్లో పూర్తి చేసి 94.46 శాతంగా నమోదైంది.

అత్యధికంగా మొక్కజొన్న, జొన్న, పెసర పంటలు

జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి అత్యధికంగా మొక్కజొన్న, జొన్న, పెసర, శనగ పంటలు సాగయ్యాయి. ఇందులో మొక్కజొన్న పంట 62,441 ఎకరాలలో సాగు కాగా 28,762 ఎకరాల్లో జొన్న, 23,928 ఎకరాల్లో పెసర, 1,822 ఎకరాలలో శనగ పంట సాగైంది. 9,245 ఎకరాల్లో మినుము, 1206 ఎకరాల్లో పొగాకు, 1520 ఎకరాల్లో వరి, 107 ఎకరాల్లో కంది, ఐదు ఎకరాల్లో వేరుశనగ, 29 ఎకరాల్లో నువ్వులు, 7 ఎకరాల్లో సోయాబీన్, 14 ఎకరాల్లో చెరకు పంటలను సాగు చేశారు.

ఆర్‌బీకేల్లో పంట నమోదు జాబితా ప్రదర్శన

జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించారు. రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఈ-క్రాప్ నమోదు గడువు ముగిసే నాటికి 1,52,736 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి అయ్యింది. ఇందుకు సంబంధించిన జాబితాను ఈ నెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించారు. గ్రామ సభలు కూడా ప్రారంభమయ్యాయి. రైతులు ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లకు తెలియజేస్తున్నారు.

జాబితాలు సరిచూసుకోండి



రబీలో సాగైన పంటల వివరాలన్నింటికీ వ్యవసాయ సిబ్బంది ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశారు. దీంతో పాటు ఈ-కేవైసీ కూడా చేశారు. ప్రస్తుతం సంబంధిత జాబితాను సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించారు. ఇందులో ఏవైనా సమస్యలుంటే వ్యవసాయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లి సరి చేసుకోవాలి.

–నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ పార్థసారథి చక్రబర్తి



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రపంచ దేశాల చూపు మనవైపే

- షిబ్‌పూర్‌లోని ఐఐఈఎస్‌టీ డైరెక్టర్ ప్రొఫెసర్ పార్థసారథి చక్రబర్తి
- ఘనంగా ప్రారంభమైన విజ్ఞాన్ సృజనాంకుర 2కే23

చేబ్రోలు: ప్రపంచ దేశాల చూపు ప్రస్తుతం మన దేశం వైపే ఉందని షిబ్‌పూర్‌లోని ఐఐఈఎస్‌టీ డైరెక్టర్ ప్రొఫెసర్ పార్థసారథి చక్రబర్తి అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో రెండు రోజుల జాతీయస్థాయి ''సృజనాంకుర-2కే23'' కార్యక్రమం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పార్థసారథి చక్రబర్తి మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సరికొత్త ఇన్నోవేషన్స్‌ను సృష్టించే విద్యార్థులు వాటిపై పేటెంట్స్‌ను పొందడం వలన దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు నాలెడ్జ్‌ను ఒకరికొకరు పంచుకుంటేనే కొత్త కొత్త ఐడియాలు పుట్టుకు వచ్చే అవకాశం ఉందన్నారు.

ఏపీ ప్రభుత్వ ఐఅండ్‌పీఆర్ అడ్వైజర్ రాజీవ్ వైఎస్సార్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక్క ఐడియాతో మీ జీవితాన్ని మార్చేసుకోవచ్చన్నారు. దేశంలో ఎన్నో సమస్యలున్నాయని... వాటిలో ఒక్క సమస్యకు సృజనాత్మకతతో కూడిన పరిష్కారం కనుగొన్నట్లయితే జీవితంలో స్థిరపడిపోవచ్చన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ యువత వినూత్న ప్రయోగాలతో ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తలుగా మారాలని ఆకాంక్షించారు. జాతీయస్థాయి సృజనాంకుర-2కే23 కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి 20వేల మందికిపైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. సృజనాంకురలో మొత్తం 9 కేటగిరీల్లో ఆటోమేషన్, ఇన్ఫ్రా ఇంజినీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, కెమికల్ టెక్నాలజీ, కంప్యూటర్ అప్లికేషన్స్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, బేసిక్ సైన్స్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. వీసీ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. శనివారం జరిగే సృజనాంకుర 2కే23 ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఇన్నోవేటర్ సుధాన్షు మణి, న్యూఢిల్లీలోని బోట్‌ల్యాబ్ డైనమిక్స్ ఎండీ డాక్టర్ సరిత అహల్వాత్, నూకాన్ ఏరోస్పేస్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ అరవింద్‌ కే సింగ్ హాజరవుతున్నట్లు వీసీ నాగభూషణ్ తెలిపారు.

గొట్టిపాళ్లకు కలెక్టర్ వరాలు

- గ్రామోదయం కార్యక్రమంలో వినతుల వెల్లువ
- అధికారులకు ఆదేశాలు జారీ



విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్

వెల్దుర్తి: జిల్లాలో వినూత్నంగా ప్రారంభిస్తున్న గ్రామోదయం కార్యక్రమాన్ని కలెక్టర్ లోతేటి శివశంకర్ శుక్రవారం ఉదయం మండలంలోని గొట్టిపాళ్ల గ్రామంలో ప్రారంభించారు. వివిధ శాఖాధికారులతో కలిసి గ్రామాలలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే పరిష్కరించదగిన సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పలువురు ఆరోగ్య సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత డాక్టర్ల చే ఆరోగ్య పరీక్ష నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు.

- కిశోర బాలికలలో రక్తహీనతను గుర్తించేందుకు పరీక్షలు చేయించాలి. తక్షణమే చేయించేలా చర్యలు తీసుకోవాలి.
- గ్రామంలో పాఠశాలలకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
- ఎస్సీ కాలనీలో కల్వర్టు వల్ల వాటర్ స్టోరేజీ పెరిగిపోవటానికి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు.
- గుండె, కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని ప్రత్యేక వైద్యులతో నరసరావుపేటలో సోమవారం ఉచితంగా వైద్యం చేయించాలన్నారు.
- ప్రభుత్వ నిబంధనల మేరకు 40 రోజుల్లో భూ పట్టాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు.
- జెర్రివాగు వాటర్ పథకం కొన్ని గ్రామాలకు ఇంకనూ అందటం లేదని ఫిర్యాదు రావడంతో సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డీఈలతో చర్చించి అన్నీ గ్రామాలకు నీరందించాలని ఆదేశించారు.
- మరసపెంట హరిజన వాడలో సర్వే కాని భూములున్నాయని, వారికి అందజేయాలని కోరారు. 600 ఎకరాల రెవెన్యూ, అటవీ శాఖ జాయింట్ సర్వే నిర్వహించి అర్హులకు తక్షణమే పట్టాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు
- బంగారు పెంటలో పర్యటించి మత్స్యకారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లలో పాఠశాలలో పర్యటించి పలు సూచనలు, సలహాలిచ్చారు.
- హాబిటేషన్‌లో ఉన్న వారికి కమ్యూనిటీ పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిందిగా రెవెన్యూ ఫారెస్టు అధికారులను ఆదేశించారు.
- శిరిగిరిపాడు ప్రాజెక్టును సందర్శించారు.

ఈ కార్యక్రమంలో గురజాల ఆర్‌డీఓ అద్దయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి జగదీశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ చింతా శివరామయ్య, మాజీ యార్డు చైర్మన్ గురుబ్రహ్మం, గ్రామ సర్పంచ్ కాయకోకుల రామాంజి, స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న నిందితుడు

గురజాల: పోలీసుల కళ్ల గప్పి తప్పించుకుపోయిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం....దొంగనోట్ల తయారీ కేసులో నిందితుడైన ఉద్దగిరి అలేఖ ఉరఫ్ అలేఖ్య మార్చి 8వ తేదిన వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసుల కళ్ల గప్పి తప్పించుకు పోయిన సంగతి పాఠకులకు విదితమే. అప్పటి నుంచి సీసీ ఫుటేజీలు పరిశీలిస్తూ పోలీసులు ప్రత్యేక టీంగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం మధ్యాహ్నం పల్లెగుంత రైల్వే ట్రాక్ అండర్ బ్రిడ్జి కింద అలేఖ ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ బి అనంతకృష్ణ తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని జడ్జి ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

జిల్లా నూతన వక్ఫ్‌బోర్డు కమిటీ నియామకం

నరసరావుపేట: పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డు కమిటీని ఏర్పాటుచేస్తూ బోర్డు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.అబ్దుల్ ఖాదిర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లపాటు కొనసాగే ఈ కమిటీకి అధ్యక్షులుగా షేక్ అక్బర్ జానీబాష, ఉపాధ్యక్షులుగా షేక్ మహమ్మద్ రషీద్, మెంబర్లుగా ఎనిమిది మంది నియమితులయ్యారు. జిల్లాలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులు కాపాడాలని కోరారు.

మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు

- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- పరీక్షా కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు



పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. ఇంటర్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాలను శుక్రవారం జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆకస్మికంగా తనిఖీచేశారు. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు జరిగే విధంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా తొలుత బాపట్ల జూనియర్ కళాశాల, సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల పరిసరాలను, తీసుకున్న భద్రతా చర్యలు, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్, ఇతర అధికారులు అనుసరించాల్సిన నిబంధనలపై పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో బయట వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు ఉండరాదన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 సీఆర్‌పీసీ అమలులో ఉన్నందున ఎవరు గుంపులుగా ఉండకూడదన్నారు. తగిన ఎస్కార్ట్‌తో ప్రశ్న పత్రాల తరలింపు, సమాధాన పత్రాలు డిపాజిట్ చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో ప్రవేశించే విద్యార్థులు, ఇన్విజిలేటర్‌లను, ఇతర సిబ్బందిని తనిఖీ చేసి మొబైల్ ఫోన్‌లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, బాపట్ల టౌన్ సీఐ పి.కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మిన్నెకల్లు గ్రామ ప్రజలు ధన్యులు

- శృంగేరీ పీఠాధిపతి మాత స్మారక కల్యాణ మంటపం ప్రారంభం
- ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్



కల్యాణ మంటపాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్

అద్దంకి: శృంగేరి శారదా పీఠాధిపతి భారతీతీర్థ స్వామి మాతృమూర్తికి జన్మనిచ్చిన మిన్నెకల్లు గ్రామ ప్రజలు ధన్యులని హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్ పేర్కొన్నారు. శృంగేరీ శారదా పీఠాధిపతి భారతీతీర్థ స్వామి మాతృమూర్తి తంగిరాల అనంతలక్ష్మమ్మ జన్మగ్రామం సంతమాగులూరు మండలం మిన్నెకల్లులో ఆమె పేరిట స్మారక కల్యాణ మంటపాన్ని నిర్మించారు. ఈ మంటప నిర్మాణానికి గొరిజవోలు కోటేశ్వరరావు, పంగులూరి మస్తాన్‌రావు స్థలాన్ని దానం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలంతా దైవభక్తి కలిగి ఉండాలన్నారు. దైవ భక్తితో శాంతి సౌఖ్యాలు కలుగుతాయని చెప్పారు. మరో ముఖ్య అతిథిగా రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. తరువాత 15వ వేద సభను తంగిరాల దక్షిణామూర్తి నిర్వహించారు. బొల్లినేని రామకృష్ణ, గాడిపర్తి లక్ష్మీనారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శారదాపీఠం నుంచి వచ్చిన ఈవో వీఆర్ గౌరీ శంకర్, స్థానిక నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుమార్తెను గర్భిణిని చేసిన తండ్రి!

గుంటూరు ఈస్ట్: కుమార్తెను ఓ తండ్రి గర్భిణిని చేసిన ఘటన చేసుకుంటుంది. సేకరించిన సమాచారం.. అరుంధతీనగర్‌లోని ట్రావెలర్స్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి మూడు నెలలుగా కన్న కుమార్తె(16)ను లోబర్చుకున్నాడు. రెండు రోజుల క్రితం బాలిక కడుపు నొప్పితో బాధపడుతుంటే తల్లి ఆస్పత్రికి తీసుకెళ్లింది. వైద్యులు పరీక్షించి స్కానింగ్ చేయించారు. స్కానింగ్‌లో బాలిక గర్భిణి అని తేలింది. దీంతో కుమార్తె ద్వారా విషయం తెలుసుకున్న తల్లి శుక్రవారం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసులు బాలికను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

తాడేపల్లి రూరల్: హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ మంగళగిరి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డి.శేషయ్య శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం.. పోలకంపాడుకు చెందిన సైకం నారాయణ చేపల వేటతో జీవనం సాగిస్తూ ఉంటారు. అతడికి రెండు పడవలు ఉన్నాయి. పడవల్లోని బ్యాటరీ వైర్లను తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌కు చెందిన కొప్పనాతి శివయ్య కత్తిరించాడని తెలుసుకున్న నారాయణ జనవరి,2020న ఉండవల్లి సెంటర్‌లో మద్యం షాపు వద్ద ఉన్న శివయ్యను ప్రశ్నించాడు. దీంతో శివయ్య ట్యూబ్‌లైట్‌తో నారాయణను కొట్టి తీవ్రంగా గాయపరిచి చనిపోయాడనుకుని వదిలేసి వెళ్లిపోయాడు. అనంతరం తేరుకున్న నారాయణ తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ శ్రీనివాసరావు శివయ్యపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు శివయ్యపై మంగళగిరి అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టులో జరిగిన విచారణ నేరారోపణ రుజువు కావడంతో శివయ్యకు మూడేళ్ల జైలుశిక్ష, 500 రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శేషయ్య తీర్పు చెప్పారు.

ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి మన్నేపల్లికి పీహెచ్‌డీ



మన్నేపల్లి తేజను అభినందిస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: ఐఐటీ ఖరగ్‌పూర్ యూనివర్సిటీలో బీటెక్, ఎంటెక్ పూర్తిచేసి ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో 'స్పార్స్ ఆల్గోరిజం ఫర్ ఈఈజీ సోర్స్ లోకలైజేషన్'పై అధ్యయనం చేసిన చీరాల కొత్తపేటకు చెందిన మన్నేపల్లి తేజకు ఇంటర్నేషనల్ జర్నల్ ప్రచురితం కావడంతో పీహెచ్‌డీ ప్రదానం చేసింది. శుక్రవారం పీహెచ్‌డీ సాధించిన తేజ, అతని తల్లిదండ్రులు విశ్రాంత ప్రిన్సిపాల్ మన్నేపల్లి బ్రహ్మయ్య దంపతులు చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతేగాక అమెరికా హూస్టన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ హెల్త్‌లో పోస్ట్ డాక్టోరల్ చేసేందుకు అవకాశం కల్పించడంతోపాటు వర్కింగ్ వీసాను అందించడంతో తేజను ఎమ్మెల్యే కరణం సత్కరించి అభినందించారు. ఈఈజీ ద్వారా బ్రెయిన్ నుంచి వచ్చే సిగ్నల్స్, బ్రెయిన్ పనితీరుతోపాటు బ్రెయిన్ ట్యూమర్ రాకుండా తీసుకోవాల్సిన పలు అంశాలపై ప్రొఫెసర్ అరవింద రాత్రే పర్యవేక్షణలో పీహెచ్‌డీ పొంది హూస్టన్ యూనివర్సిటీలో సీటు సాధించడాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. విద్యతోనే ఉన్నత స్థానంలో నిలుస్తారనే మన్నేపల్లి తేజ నిదర్శనమన్నారు. అలానే వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, ప్రముఖ వైద్యులు గోరంట్ల సుబ్బారావు, గోరంట్ల కిరణ్‌లు స్కాలర్ తేజను అభినందించారు. వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ బాల సుబ్బారావు, మేజర్ తోట రోశయ్య, అధ్యాపకులు రాధాకృష్ణమూర్తి, సుబ్బారావు, భూపేంద్రలు అభినందించారు.

పంచాయతీ కార్యదర్శికి ఏడాది జైలు

గుంటూరు లీగల్: బిల్డింగ్ ప్లాన్ ఆమోదించడానికి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శికి ఏడాది జైలు, రూ.2,500 జరిమాన విధిస్తూ విజయవాడ ఎస్‌పీఈ, ఏసీబీ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2011లో పల్నాడు జిల్లా, గురజాల మండలం, పులిపాడు గ్రామానికి పంచాయతీ కార్యదర్శిగా బొగ్గవరపు కాశీవిశ్వనాథం పని చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఉల్లేరు వెంకటేశ్వర్లు నిర్మించదలచుకున్న బిల్డింగ్ ప్లాన్ ఆమోదానికి పంచాయతీకి దరఖాస్తు చేసుకున్నాడు. దీనిని ఆమోదించడానికి అప్పటి పంచాయతీ కార్యదర్శి రూ.2 వేలు డిమాండ్ చేశాడు. దీంతో వెంకటేశ్వర్లు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. 2011 ఏప్రిల్ 23న వెంకటేశ్వర్లు నుంచి కాశీవిశ్వనాథం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏసీబీ గుంటూరు స్పెషల్ పీపీ పీఎస్ ఆనంద జ్యోతి కేసును వాదించారు. హెడ్ కానిస్టేబుల్ పి.సురేష్ బాబు సహకరించారు.

పిడుగులు పడి వరి కుప్పలు దగ్ధం



యాజలిలో పిడుగు పడి దగ్ధమైన వరికుప్ప

.కర్లపాలెం: రైతన్నలు ఆరుగాలం శ్రమించి సాగు చేసి పండించుకుని తమ పొలాల్లో వేసిన కుప్పలు పిడుగులు పడి పూర్తిగా దగ్ధమైన సంఘటన శుక్రవారం కర్లపాలెం మండల పరిధిలో చోటు చేసుకుంది. కర్లపాలెం మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని పలుచోట్ల పిడుగులు పడి మొత్తం ఏడున్నర ఎకరాలలో వరికుప్పలు దగ్ధమయ్యాయి. సుమారుగా రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం కురిసిన అకాల వర్షాలకు యాజలి గ్రామానికి చెందిన ఆవుల నాగేశ్వరరావుకు చెందిన రెండు ఎకరాల విస్తీర్ణంలోని వరికుప్ప, నాగరాజుపాలెం గ్రామానికి చెందిన షేక్ సుల్తాన్‌కు చెందిన రెండు ఎకరాల విస్తీర్ణంలోని వరికుప్ప, దుండివారిపాలెం గ్రామం పరిధిలోని తమలపాకుల ఏసుబాబుకు చెందిన 1.50ఎకరాల విస్తీర్ణంలోని వరికుప్ప, పెదగొల్లపాలెం పంచాయతీ గాంధీనగర్‌కు చెందిన వడ్లమూడి శివపార్వతికి చెందిన రెండు ఎకరాల వరికుప్పపై పిడుగులు పడి పూర్తిగా దగ్ధమయ్యాయి. తెల్లవారుజామునే వర్షంతోపాటు పిడుగులు పడి వరికుప్పలు దగ్ధమవటంతో అవిపూర్తిగా కాలిపోయేంత వరకు రైతులు గమనించకపోవటంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దగ్ధమైన వరికుప్పలను స్థానిక వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

వైద్య సిబ్బందికి పదోన్నతులు

గుంటూరు మెడికల్: వైద్య ఆరోగ్య శాఖలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేస్తున్న పలు కేడర్‌ల ఉద్యోగులకు శుక్రవారం ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) 35 మందిని కౌన్సెలింగ్‌కు పిలువగా, ఏడుగురు పదోన్నతి వద్దని లిఖిత పూర్వకంగా లేఖ ఇవ్వడంతో 25 మందికి ఎంపీహెచ్‌ఈఓలుగా ప్రమోషన్ ఇచ్చారు. నెల్లూరు జిల్లా కొడవలూరు పీహెచ్‌సీలో పనిచేస్తున్న పి.వి.ఎస్.ఎన్.మూర్తి గ్రేడ్-2 ఫార్మాసిస్టుకు గుంటూరు జీజీహెచ్ గ్రేడ్-1 ఫార్మాసిస్టుగా ప్రమోషన్ ఇచ్చారు. నెల్లూరు జిల్లా తురిమెళ్ల పీహెచ్‌సీలో పనిచేస్తున్న గ్రేడ్-2 ఫార్మాసిస్టు ఎం.విజయ్‌కు ఒంగోలు జీజీహెచ్‌లో గ్రేడ్-1 ఫార్మాసిస్టుగా ప్రమోషన్ ఇచ్చారు. ఒంగోలు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పి.రజినికి ఒంగోలు నర్సింగ్ స్కూల్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇచ్చారు. ప్రకాశం జిల్లా కురిచేడులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.సత్యంకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఫిమేల్ రీజనల్ ట్రైనింగ్‌సెంటర్‌లో సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇచ్చారు. గుంటూరు జిల్లా భట్టిప్రోలు పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు నెల్లూరు మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇచ్చారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆర్డీతో పాటు డెప్యూటీ డైరెక్టర్ అంజయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సుధీర్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్‌లు షేక్ నాగూర్ షరీఫ్, పాల్, సుబ్బారావు, బి.శ్యామ్‌అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రణక్షేత్రానికి తరలిన కన్నమదాసు విగ్రహం



రణ స్థలంలో దిమ్మెపై ఉంచిన కన్నమదాసు విగ్రహం

కారెంపూడి: పల్నాటి మాచర్ల రాజ్య వీర సేనాని మాల కన్నమదాసు విగ్రహం పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో కొలువుదీరడానికి శుక్రవారం తరలి వచ్చింది. గ్రామ నడిబొడ్డున కన్నమదాసు మేడ వద్ద విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే చాలా వరకు కన్నమదాసు మేడ ప్రాంతాన్ని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఆలోచన, సహకారం మేరకు అక్కడ విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు మాల సమాజం నడుం బిగించింది. మర్రి శేషయ్య ఆధ్వర్యంలో మాలలు పనులు కూడా శరవేగంగా చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిలకలూరిపేటలో చేయించిన తొమ్మిది అడుగుల కన్నమదాసు విగ్రహాన్ని వైఎస్సాసీపీ నాయకులు రణస్థలానికి తరలించారు. విగ్రహాన్ని క్రేన్‌తో దిమ్మెపై ఉంచారు. ఇప్పటికే బ్రహ్మనాయుడు విగ్రహం రణస్థలంలో ఉంది. ఆయన మానస పుత్రుడు కన్నమదాసు విగ్రహం కూడా ఇక్కడ ఏర్పాటైతే పల్నాటి రణక్షేత్రం మరింత చారిత్రక శోభ సంతరించుకుంటుంది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, మర్రి శేషయ్య, ఎంపీటీసీ సభ్యులు అంతరగడ్డ ఏసోబు, చెన్నకేశవ స్వామి ట్రస్టు బోర్డు చైర్మన్ చల్లా వీర్లవరప్రసాదరావు, కాలె రాంబాబు, కాలె మల్లేశ్వరరావు, కాలె శివ, మైలా ఆనందరావు, నూకాబత్తిన సాంబయ్య, పాతూరి రామిరెడ్డి, ఆశం విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం కేసులో ఇద్దరు మహిళల అరెస్ట్

తాడేపల్లిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతున్న తాడేపల్లికి చెందిన నాగరాజు ఇద్దరు భార్యలను పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. సేకరించిన వివరాలు.. తాడేపల్లి సలాం హోటల్ సెంటర్‌లో నివాసముండే మానుపాటి నాగరాజు భార్యలైన సుభాన్‌బీ, మహేశ్వరి గోవా మద్యం అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డారు. నాగరాజు గోవా నుంచి మద్యం తీసుకు వస్తే ఇద్దరు భార్యలు అమ్మకాలు నిర్వహిస్తున్నారు. తాడేపల్లి ఎస్ఐ రమేష్‌కు నాగరాజు ఇంట్లో గోవా మద్యం ఉందని సమాచారం అందడంతో తనిఖీ చేసి, 28బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నాగరాజు గోవా నుంచి మద్యం తీసుకువచ్చి రైలులో తాడేపల్లి శివారు ప్రాంతంలో దిగి మద్యాన్ని ఇంటికి తరలిస్తున్నాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

విజ్ఞాన ప్రతిభకు గుర్తింపు

- వర్సిటీలో ముగిసిన అకడమిక్ ఎగ్జిబిషన్
- ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు



డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎ. శ్రీనివాసమూర్తి, ఏఎన్‌యూ వైస్ చాన్సలర్ రాజశేఖర్ చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకుంటున్న ఏఎన్‌యూకి చెందిన ఆర్కిటెక్చర్, ప్లానింగ్ విద్యార్థులు

ఏఎన్‌యూ: అకడమిక్ ఎగ్జిబిషన్‌లో మేధస్సు, విజ్ఞానం, ఉత్సాహాలను కనబరిచి అత్యుత్తమ ప్రదర్శనలు, నూతన ఆవిష్కరణలు చేసిన యువతీయువకులకు ప్రత్యేక గుర్తింపు లభించింది. మూడు రోజులపాటు నిర్వహించిన అకడమిక్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రదర్శనలు చేసిన వారికి శుక్రవారం నిర్వహించిన ముగింపు సభలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డాక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి, ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, అకడమిక్ ఎగ్జిబిషన్ కోఆర్డినేటర్ కె.మధుబాబు బహుమతులు అందజేశారు.

విజేతలు..

యూనివర్సిటీ అనుబంధ కళాశాలల కేటగిరీలో చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, వీవీఐటీ ఉన్నాయి. యూనివర్సిటీ సైన్స్ కళాశాల విభాగంలో బయోకెమిస్ట్రీ, జువాలజీ అండ్ ఆక్వాకల్చర్, బోటనీ అండ్ మైక్రోబయాలజీ విభాగాలు, యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల విభాగంలో కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, సోషియాలజీ అండ్ సోషల్‌వర్క్ విభాగాలున్నాయి. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, యోగాకేంద్రం ఉన్నాయి. యూనివర్సిటీ పరిశోధనా కేంద్రాల విభాగంలో గాంధియన్ అధ్యయన కేంద్రం, మహాత్మా జ్యోతిరావ్‌పూలే అధ్యయన కేంద్రం, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం, యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల కేటగిరీలో ఇండస్ట్రియల్ ఫార్మసీ, ఫార్మాసూటికల్ కెమిస్ట్రీ, ఫార్మాకాగ్నోసిస్ ఉన్నాయి. ఆర్కిటెక్చర్ విభాగంలో బ్యాచులర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, బ్యాచులర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ మొదటి, రెండవ బహుమతులు దక్కించుకున్నాయి. రాష్ట్ర స్థాయి ప్రభుత్వ సంస్థల విభాగంలో ఏపీఎస్ఆర్‌టీఎస్, ఇండో యూరో సింక్రనైజేషన్, ఏపీ ఇన్నోవేషన్ వాలీ ఉన్నాయి. వీటితోపాటు డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో విభాగాల వారీగా మొదటి, రెండో, మూడు బహుమతులు అంజేశారు. హైదరాబాద్ సీఎంఆర్ విద్యా సంస్థలతోపాటు, విట్ ఏపీ, ఎస్ఆర్ఎం ఏపీ, తదితర ఇంజినీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీలోని పలు విభాగాలు, పరిశోధనా కేంద్రాలు ప్రత్యేక బహుమతులు పొందాయి.

విజ్ఞాన సంపద యువత...

బహుమతులు ప్రదానోత్సవ సభలో ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రసంగిస్తూ యువత విజ్ఞాన సంపద అన్నారు. విజ్ఞాన సముపార్జనలో యువత విజయవంతమైన పాత్ర పోషించడంతోపాటు దానిని నలుగురికీ పంచడం అభినందనీయమన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి ప్రసంగిస్తూ యువతలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు అకడమిక్ ఎగ్జిబిషన్ మంచి వేదికగా నిలిచిందని చెప్పారు. రిజిస్ట్రార్ బి.కరుణ ప్రసంగిస్తూ విజ్ఞానం పెంచుకోవడంతోపాటు దానిని పంచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. అకడమిక్ ఎగ్జిబిషన్ కోఆర్డినేటర్ కె.మధుబాబు ప్రసంగిస్తూ మూడు రోజులపాటు జరిగిన ఎగ్జిబిషన్‌లో 850కిపైగా ప్రదర్శనలు విజయవంతంగా జరిగాయన్నారు.